క్లుప్తంగా

బురదలో కూరుకుపోయిన పారిశుధ్య వాహనం



బురదలో నుంచి వాహనాన్ని బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న తాగునీటి వాటర్ ట్యాంక్ వద్ద పారిశుధ్య వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షం కారణంగా ఓ వాహనం అక్కడ బురదలో కూరుకుపోయింది. చాలాసేపు శ్రమించి దాన్ని బయటికి తీశారు. ఇదిలా ఉండగా మంచినీటి ట్యాంక్ వద్ద చెత్త తరలించే వాహనాలు పార్కింగ్ చేయడమేమిటని పలువురు విమర్శిస్తున్నారు.

సర్వీసు రోడ్డు దుర్గంధభరితం



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

మద్రిపాలెం: బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి ఆర్ అండ్ బి జంక్షన్ వద్ద ఉన్న సర్వీస్‌రోడ్డు నీటి ప్రవాహానికి బురదమయమయ్యింది. అంతే కాక కాలువలో పేరుకుపోయిన చెత్త రోడ్డు పైకి రావడంతో అక్కడ సేవామార్గం అంతా దుర్గంధభరితంగా మారింది. దీంతో అటుగా ప్రయాణాలు సాగించిన వాహన చోదకులు, పాదచారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ మాత్రం ఏమరుపాటుగా వెళ్లినా వాహనాలు జారిపడే ప్రమాదమూ లేకపోలేదు. అధికారులు స్పందించి తక్షణం సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు జలాభిషేకం చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం దేవస్థానం ఈవో జి.వి. రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. అర్చకుడు భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



రాంజీ ఎస్టేట్‌లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి కప్పరాడ, రాంజీ ఎస్టేట్ కొండవాలు ప్రాంతాల్లో బుధవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఆదేశాల మేరకు సిబ్బంది విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. పారిశుధ్య సిబ్బంది చెట్లకొమ్మలు తొలగించారు.

ఎండైనా.. వానైనా.. ఆరుబయటే నిరీక్షణ



తాటిచెట్లపాలెం వైపు వెళ్లే బస్సుల కోసం ఎండలో ఎదురు చూస్తున్న ప్రయాణికులు



ఎన్‌ఏడీ వైపు వెళ్లే బస్సుల కోసం బిర్లా జంక్షన్ హైవే వద్ద ఎండలో ప్రయాణికుల పడిగాపులు



షెల్టర్ లేని మురళీనగర్ బస్టాప్



షెల్టర్‌కు నోచుకోని వర్మా కాంప్లెక్స్

బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు

జీవీఎంసీ 49, 50, 51 వార్డుల పరిధిలో వేధిస్తున్న సమస్య

ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికుల ఆవేదన

మద్రిపాలెం: అసలే ఎండా కాలం.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఉదయం వాతావరణం తారెత్తిస్తోంది. వివిధ పనుల మీద బయటికి వెళ్లేవారు రోడ్లపై బస్సుల కోసం మండుటెండలో వేచి చూడాల్సి వస్తోంది. కనీసం షెల్టర్లు కూడా లేకపోవడంతో పలువురు మండిపడుతున్నారు. అక్కడ రోడ్డుపై ఉన్న చెట్లే వారికి నీడనిస్తున్నాయి. రోజుకు వందలాది మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు గంటల తరబడి బస్సుల కోసం వేచి చూస్తున్న తరుణంలో కనీసం నిల్చునేందుకు నిలువ నీడ కూడా లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ రోడ్లపైనే పడిగాపులు కాయాల్సి వస్తోంది.

పలు వార్డుల్లో..

జీవీఎంసీ 49,50,51 వార్డుల్లో జాతీయ రహదారి బిర్లా జంక్షన్‌లో రహదారికి ఇరువైపుల దాదాపు అన్ని బస్సులకు హాల్ట్ ఉంటుంది. ఆ మార్గంలో వెళ్లే ప్రతి బస్సు అక్కడ ఆగాల్సిందే. అయినా అక్కడ బస్సు షెల్టర్ లేక నిలువ నీడ లేకుండా పోతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దగ్గరలో ఉన్న చెట్ల కింద నిలబడి బస్సు వచ్చాక రోడ్డు పైకి వస్తున్నామని అంటున్నారు. సర్వీస్ రోడ్డులో ఎప్పటిదో పాత బస్ షెల్టర్ ఉన్నా అక్కడ ఎవరూ కూర్చోరు. ఎందుకంటే అక్కడ కూర్చుంటే ఏ బస్సు వస్తుందో కనిపించని పరిస్థితి. ఒకవేళ తెలిసినా ఆ జంక్షన్‌లో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండడంతో బస్సు కోసం వచ్చేలోపే అది వెళ్లిపోయే అవకాశం ఉంది. అదీ కాక రోడ్డు మీద నిలబడి వేచి చూసేవారు ముందుగా బస్సు ఎక్కడంతో సీట్లు నిండిపోతాయి. దీంతో వెనుక ఉన్నవారు నిల్చుని వెళ్లాల్సిన పరిస్థితి కావడంతో చేసేది లేక రోడ్డు పైనే పడిగాపులు కాస్తూ బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు.

హాల్టులున్నా.. షెల్టర్లు కరువు..

ఇదిలా ఉండగా మాధవధార 48 లాస్ట్ బస్టాప్ నుంచి అటు పోర్టు రోడ్డు హైవే వరకు చాలా స్టాపులు ఉంటాయి. ఇటు ఈస్ట్ పార్కు వద్ద రెండు వైపులా, అలాగే మురళీనగర్ వద్ద సిటీ నుంచి వచ్చే స్టాప్ వద్ద, వర్మా కాంప్లెక్స్‌కు ఇరువైపులా, మసీదు జంక్షన్ వద్ద పలు చోట్ల బస్సులు ఆగుతుంటాయి. కానీ ప్రయాణికుల సౌకర్యార్థం ఆయా స్టాపుల్లో షెల్టర్లు మాత్రం లేవు. మాధవధార ఈస్ట్ పార్కు, మురళీనగర్, తెన్నేటినగర్, వర్మా కాంప్లెక్స్, మసీద్ జంక్షన్ వంటి జన సమూహం ఎక్కువగా ఉన్న 48 బస్ రూట్‌లో ఆయా జంక్షన్లలో బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండైనా.. వానైనా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

గత ప్రభుత్వమే నయమంటున్న ప్రయాణికులు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో చాలా చోట్ల సుందరీకరణ పనుల్లో భాగంగా బస్ బేలు ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు ఎండకు, వానకు ఇబ్బంది లేకుండా ప్రయాణాలు చేసేవారు. ఏది ఏమైనా ప్రభుత్వం ప్రజలకు కావాల్సిన కనీస సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను పట్టించుకోకపోవడం సరికాదంటున్నారు. హామీలు అమలు చేయలేని ప్రభుత్వం భవిష్యత్తులో ప్రజలను ఎలా పాలిస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని షెల్టర్లు లేని, ఇబ్బందిగా ఉన్న చోట బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మజ్జిగ పంపిణీ



బాటసారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న వనితా వాకర్స్

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్థానిక వర్మ కాంప్లెక్స్ వద్ద 48 బస్ రూట్‌లో బాటసారులు, ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, ఆర్సీ–5 యు.శుభ, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో చలివేంద్రం



వినియోగదారులకు మజ్జిగ అందజేస్తున్న రైతులు

కంచరపాలెం: స్థానిక రైతుబజారులో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని రైతులు మజ్జిగ పంపిణీ చేశారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి జె.జగదీశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో వినియోగదారులు, రైతులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు, డ్వాక్రా మహిళలు, వినియోగదారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘మల్లం’ ఘటనపై ఎఫ్‌ఐఆర్ నమోదుకు డిమాండ్



నిరసన తెలుపుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పారావు, నాయకులు

కంచరపాలెం: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లం గ్రామంలో జరిగిన దళితుల సాంఘిక బహిష్కరణపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు హెచ్చరించారు. ఈ ఘటనపై తక్షణమే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం మల్లంలో మూడు రోజుల పాటు దళితులను వెలివేసిన ఘటనపై జిల్లా అధికారుల తీరు సరికాదన్నారు. విద్యుత్ ప్రమాదం వల్ల మరణించిన పల్లపు సురేష్ కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని కోరారు. దీనికి కారకులైన నిందితులను కాపాడుతున్న అధికారులపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన సిటీ కన్వీనర్ గొల్లమాల మీన, నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి చింతల మల్లికార్జున, నగర కార్యదర్శి పట్నాల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీవో శ్రీలత

సీతమ్మధార: కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించినట్లు ఏసీడీపీవో శ్రీలత తెలిపారు. విశాఖ అర్బన్ పరిధి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10 వరకు వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా బుధవారం నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల హక్కులు, చట్టాలపై వివరించారు. బాల్య వివాహాల కట్టడి, బాలికల అక్రమ రవాణా నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుమారి, బి.మమత, బి.శకుంతల, ఎన్.సాయికుమారి, బి.గౌరి తదితరులు పాల్గొన్నారు.

‘నవ జీవన వైతాళికులు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కె.ఎస్.చలం, సాహితీవేత్తలు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శత వసంతాల రచయిత్రి రాజమ్ కృష్ణన్ రచించిన ‘నవ జీవన వైతాళికులు’ పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. బసు పోతన ఆహ్వానం పలకగా.. సభాధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు స్వాగతోపన్యాసం చేశారు. సాహితీవేత్త, నాటక కర్త పాలిమెరశెట్టి ఫ్రాన్సిస్ శ్రీశ్రీ జయభేరి కవితను వినిపించారు. అరసం 90 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఎస్.హనుమంతరావు అరసం చరిత్రను వివరించారు. ముఖ్య అతిథి యూపీఎస్సీ పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయితకు అభినందనలు తెలిపారు. పుస్తకంలోని మహిళల ఆర్థిక సమానత్వం గురించి మాట్లాడారు. విమర్శకుడు ఆచార్య చందు సుబ్బారావు కవితా శైలిని విశ్లేషించారు. ఏయూ తెలుగు శాఖ ప్రొఫెసర్ డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ పుస్తక సమీక్ష చేసి మాట్లాడుతూ దివంగత రాజమ్ కృష్ణన్ అనుభవాలు, అభిప్రాయాలతోపాటు గొప్ప అంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. మరో సమీక్షకురాలు అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.సుధ మాట్లాడుతూ రాజమ్ కృష్ణన్ రష్యాలో విహరించి, తన ఆలోచనలను పుస్తకంలో పొందుపరిచారన్నారు. ప్రచురణ కర్త, మానవ హక్కుల వేదిక కార్యకర్త పోలిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజా నాట్య మండలి గురించి వివరించారు. సోషలిస్ట్ సమాజంలో మహిళా ఎలా ఉండాలో ఈ పుస్తకం చెబుతుందన్నారు. కార్యక్రమంలో కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు, సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు, విశాఖ రచయితల సంఘం అధ్యక్షుడు అడపా రామకృష్ణ, రచయిత బండి సత్యనారాయణ, కథా రచయిత మేడా మస్తాన్ రెడ్డి, పద్యకవి సిహెచ్.చిన సూర్యనారాయణ, రాధారాణి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కాకరపర్తి సత్యనారాయణమూర్తి, సౌభాగ్యలక్ష్మిలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్ నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయం 11వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శక్తి పంచాయతన పీఠం పీఠాధిపతి బ్రహ్మశ్రీ కాకర పర్తి సత్యనారాయణ మూర్తి, సౌభాగ్యలక్ష్మి 108 కలశాలతో ఆలయంలోని విగ్రహాలకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చొపల్లి భాస్కరరావు, సహాయ అర్చకుడు వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ కార్యదర్శి ప్రకాష్‌రావు, గొర్లె కృష్ణ, టి.వెంకటరావు, పి.వి.రమణ, పి.ముత్యాలరావు, సీహెచ్ లక్ష్మణరావు, టి.శైలుకుమారి, కోటేశ్వరమ్మ, వెంకటలక్ష్మి, రత్న, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ మ్యాగజైన్ ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ప్రతిభా మ్యాగజైన్ హిందీ సంచికను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఆవిష్కరించారు. విద్యార్థినులైన రచయిత్రులకు పత్రిక కాపీలు అందించారు. వారి ప్రతిభ, నిబద్ధతను ప్రశంసించారు. ఎడిటర్, హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి, హిందీ శాఖ అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.దీప్తి కృషిని ప్రిన్సిపాల్ షైజీ ప్రశంసించారు. గత 19 సంవత్సరాలుగా ప్రతిభ మ్యాగజైన్ విద్యార్థినుల సృజనాత్మకత వ్యక్తీకరణ ప్రదర్శించడానికి ఒక వేదికగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్లు నాన్సీ, మేరీ, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అభయ దుర్గాదేవికి విశేష పూజలు



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని అభయ దుర్గాదేవి ఆలయ ఏడో వార్షికోత్సవం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 7.30 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. 9 గంటలకు విశేష అలంకరణలో భక్తులకు దుర్గాదేవి దర్శనమిచ్చారు. అక్షయ తృతీయ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ఆవరణలో నవ దుర్గా, శ్రీసూక్త సంపుటిత, లక్ష్మీ హోమం, ఉప దేవతా హోమం నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న రాట మహోత్సవం



బల్లిగిరి వెంకన్న కల్యాణోత్సవానికి రాట వేస్తున్న అర్చకుడు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవం సందర్భంగా బుధవారం దేవాలయం ఆవరణలో కల్యాణ రాట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు విశేష అభిషేకాలను నిర్వహించారు. ముందుగా ముత్తయిదువులు మేళతాళాలు, వేద మంత్రాల మధ్య ముహూర్తపు రాటకు పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు రఘునాథాచార్యులు మాట్లాడుతూ 7వ తేదీన అంకురార్పణ, 13వ తేదీన పుష్పాంజలి సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. కల్యాణంలో పాల్గొనదలచిన భక్తులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 7వ తేదీ ఉదయం పంచామృతాభిషేకాలు, స్నపనం, తిరుమంజన సేవ, నూతన వస్త్రాలంకరణ, సాయంత్రం ఉత్సవ సంకల్పం, ఆరాధన, నివేదన, ఉత్సవ సంకల్పం ఉంటాయన్నారు. 8వ తేదీన ధ్వజారోహణం, రాజభోగం, నివేదన, సాయంత్రం స్వామి వారి తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు. 10వ తేదీన హోమాలు, 12వ తేదీన వైశాఖ పూర్ణిమ సందర్భంగా శేషహోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం, సాయంత్రం ధ్వజావరోహణం, సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్రహారతి, సప్తహారతి ఉంటాయన్నారు. 13వ తేదీ సాయంత్రం శ్రీవారి పుష్పాంజలి ఉత్సవం, ఊంజల్ సేవ, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. స్వామి వారి తిరుకల్యాణోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు దేవస్థానంలో రూ.1116 చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

భారతీయ నృత్యానికి విశ్వవ్యాప్త ఆదరణ

దాబాగార్డెన్స్: భారతీయ నృత్యానికి విశ్వవ్యాప్తంగా ఆదరణ ఉందని శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేస్ అధ్యక్షురాలు పైడి రజని తెలిపారు. ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే సందర్భంగా కాళీ మాతా మందిరం వద్ద శాస్త్రీయ నృత్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్యం అన్ని వర్గాల వారి ఆదరణ చూరగొంటుందన్నారు. దీనిని నేటి తరం ప్రోత్సహించాలన్నారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వై. సోమలత మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల నృత్యం వైపు నేటి యువత మొగ్గు చూపుతుందన్నారు. చిరకాలం నిలిచేది శాస్త్రీయ నృత్యమేనన్నారు. పలు విశ్వ విద్యాలయాల్లో శాస్త్రీయ నృత్యంపై ఉన్న కోర్సులు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య దర్శకురాలు లీలాజగన్ మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యానికి ఉన్న ఆదరణ ఎప్పటికీ చెరిగిపోదన్నారు. కార్యక్రమంలో పి. మౌనిక, కె. రుత్విక్, నేహానాయక్, లక్ష్మీ కార్తీక, డి. దక్షిత, ప్రణవ, గ్రీష్మ, దీక్షాశ్రీ, స్నేహాంజలి, భువనేశ్వరి, నృత్య దర్శకురాలు సౌందర్య సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మేడే వేడుకల్లో పాల్గొన్న వామనమూర్తి తదితరులు

అల్లిపురం: డ్రైవర్లకు భారీగా జరిమానాలు విధించే 21,31 జీవోను రద్దు చేసి, డ్రైవర్లందరికీ పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. 139వ మే డే సందర్భంగా రైల్వేస్టేషన్ ఎదుట బుధవారం నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో కార్మికుడు కె. చంటి మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 1886 మే 1న అమెరికా దేశం చికాగో నగరంలో కార్మిక వర్గం 8 గంటల పని విధానం అమలు చేయాలని పోరాడి అమరులైన అమర జీవులకు జోహార్లు అర్పించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి డ్రైవర్లకు ఆహార భద్రత లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల హక్కులను హరిస్తే ప్రభుత్వాల పతనం తప్పదని హెచ్చరించారు. మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆటో డ్రైవర్లు, మోటార్ వాహన డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాల కళ్లు తెరిపించాలని డ్రైవర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మేడేని సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో సంఘం జిల్లా నాయకులు వై. వెంకటి, నాయకులు కె. అప్పలరాజు, ఎల్. పరశురాం, పిల్లా శంకర్, ఎస్. అనిల్, వి.సంతోష్, కె. రాము తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



అనాథలకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. రైల్వే న్యూకాలనీ షిర్డీసాయిబాబా మందిర సమీపంలో ఉన్న అనాథలకు మధ్యాహ్నం పులిహోర, దద్దోజనం, అరటి పండ్లు అందించారు. వంద మందికి విసనకర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

దాబాగార్డెన్స్: ఒరిస్సా స్టీవర్స్ షిప్పింగ్ కంపెనీ వ్యవస్థాపకుడు మహిమానంద మిశ్రా 72వ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు జె.కె.నాయక్ తెలిపారు. బుధవారం వన్‌టౌన్‌లో గల కంపెనీ కార్యాలయంలో రోటరీ బ్లడ్ బ్యాంకు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ మెగా రక్తదాన శిబిరంలో 88 మంది రక్తం దానం చేసినట్లు చెప్పారు.